క్లుప్తంగా

నేడు పీఏసీఎస్ సమావేశం

వరంగల్: వరంగల్ ఆరెపల్లిలోని వరంగల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి చెందిన ఎరువుల గోదాంలో సంఘం సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి దామోదర్ ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం అధ్యక్షుడు ఇట్యాల హరికృష్ణ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో పైడిపల్లి, ఆరెపల్లి, కొత్తపేట, దేశాయిపేట, ఏనుమాముల, మట్వాడ గ్రామాల రైతులు, సంఘం సభ్యులు పాల్గొనాలని కోరారు.

నేడు ఫొటో, వీడియోగ్రాఫర్స్ ఎన్నికలు

కాజీపేట రూరల్: తెలంగాణ రాష్ట్ర ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఎన్నికలను కాజీపేట జంక్షన్‌లోని రైల్వే కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం ఉదయం 8నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయని సంఘం కాజీపేట అధ్యక్షుడు టి.జగదీశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

తెల్లవారుజాము నుంచే మద్యం అమ్మకాలు



వరంగల్ క్రైం: నిబంధనలకు విరుద్ధంగా తెల్లవారుజామున 5.30 గంటలకే బార్ తెరిచి మద్యం అమ్మకాలు చేపట్టిన బార్ నిర్వాహకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని డబ్బాల జంక్షన్‌లోని శ్రీరామా బార్ అండ్ రెస్టారెంట్‌లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. కౌంటర్‌పై ఉన్న మాచర్ల శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని రూ.3,890 విలువ గల మద్యం, రూ.3,650 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. టాస్క్‌ఫోర్స్ దాడిలో ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సై శరత్, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగకు దేహశుద్ధి

వరంగల్ అర్బన్: ఇనుప రాడ్లను అపహరిస్తున్న దొంగలను బల్దియా సెక్యూరిటీ గార్డు పట్టుకొని దేహశుద్ధి చేసి మట్టెవాడ పోలీసులకు అప్పగించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి బల్దియా ప్రధాన కార్యాలయానికి చెందిన మధ్య గేట్‌ను మూసివేసేందుకు సెక్యూరిటీ గార్డు సదానందం చారి అక్కడికి వెళ్లగా మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వ్యక్తులు పార్కుకు సంబంధించి ఇనుప రాడ్లను తొలగిస్తుండగా, మరో వ్యక్తి వాహనంలో చేరవేస్తున్నాడు. సెక్యూరిటీ గార్డు సదానందం అక్కడి వెళ్లగా ఇద్దరు వ్యక్తులు పరారు కాగా, ఒక వ్యక్తికి అదుపులోకి పట్టుకొని మట్టెవాడ పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

రాష్ట్రస్థాయి బృందగీతాల పోటీలకు ఓరుగల్లు విద్యార్థులు

విద్యారణ్యపురి: భారత వికాస పరిషత్ (బీవీపీ) తెలంగాణ ప్రాంత విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఈనెల 29న ఇందిరా చంద్రశేఖర్ ఆడిటోరియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జాతీయ బృందగీతాల పోటీలకు ఓరుగల్లు శాఖ నుంచి రెండు గ్రూపుల బృందాల నుంచి 24మంది విద్యార్థులు పాల్గొననున్నట్లు బీవీపీ వరంగల్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ సుధీర్ కుమార్, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ గురువారం తెలిపారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుమన్‌కు రోటరీ బిల్డర్ అవార్డు

దేశాయిపేట: ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక సేవకుడు హనుమకొండ రంగంపేటలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గజ్జెల సుమన్.. హనుమకొండ రోటరీ క్లబ్ నేషన్ బిల్డర్ అవార్డును వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎస్‌వీఎస్ అధినేత తిరుమల రావు నుంచి అందుకున్నారు. హనుమకొండ భీమారంలోని ఎస్వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్‌కు చెందిన స్కిల్ స్పార్క్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు బుధవారం రాత్రి జరిగాయి. గజ్జెల సుమన్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఆయనకు అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ హనుమకొండ ప్రధాన కార్యదర్శి కె.ప్రవీణ్ కుమార్, కోశాధికారి ఏ.విజయ్‌కుమార్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎస్సై వలీ హఠాన్మరణం



వలీ (ఫైల్)

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఎస్సై, మాజీ వార్డు సభ్యుడు మహ్మద్ వలీ (76) గురువారం రాత్రి గుండెపోటుకు గురై మృతి చెందారు. మృతుడికి ఐదుగురు కుమారులు, కూతురు ఉన్నారు. వలీ మృతిపై వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, కొండేటి శ్రీధర్, స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, దేవస్థాన ధర్మకర్త వెంకటస్వామి, తదితరులు సంతాపం ప్రకటించారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో..



జానపద గిరిజన విజ్ఞానపీఠంలో ఐలమ్మకు నివాళులర్పిస్తున్న బాబురావు, పీఠం సిబ్బంది



పీటీసీలో.. ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ





వరంగల్ 27వ డివిజన్‌లో..

వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని నగర వ్యాప్తంగా గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈమేరకు ఐలమ్మ వీరత్వాన్ని పలువురు కొనియాడారు.

\- సాక్షి నెట్‌వర్క్



కేయూలో బీసీ సెల్ ఆధ్వర్యంలో..



బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో..



కాశిబుగ్గ: ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కార్పొరేటర్ ప్రవీణ్, తదితరులు



చాకలి ఐలమ్మ వారసులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేత పగడాల సతీష్



హసన్‌పర్తి: ముచ్చర్లలో..



హన్మకొండ చౌరస్తా: కాపువాడలో..



కాజీపేట బాపూజీనగర్‌లో..



కాజీపేట: సిద్ధార్థనగర్‌లో..

పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం

వరంగల్ అర్బన్ : పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్య రక్షణ, సంక్షేమం తమ ధ్యేయమని నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. 'స్వచ్ఛతా హీ సేవా–2024' కార్యక్రమంలో భాగంగా గురువారం బల్దియా ఆధ్వర్యంలో ప్రతిమ కేన్సర్ ఇనిస్టిట్యూట్ సహకారంతో పారిశుద్ధ్య సిబ్బంది, సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్‌లకు ఇండోర్‌స్టేడియంలో ఏర్పాటుచేసిన ఉచిత ఆరోగ్య శిబిరం (హెల్త్ క్యాంప్)ను మేయర్, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. మొదట మేయర్, ఎమ్మెల్యేలకు కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులతోపాటు వారి కుటుంబసభ్యులు ఆరోగ్యంగా ఉండాలన్నదే బల్దియా ప్రధాన ఉద్దేశ్యమన్నారు. మేయర్ సుధారాణి మాట్లాడుతూ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి మాస్టర్ చెకప్ కోసం ఆరోగ్యకార్డులు అందజేయాలని ప్రతిమ హాస్పిటల్ వారిని కోరినట్లు తెలిపారు. కార్పొరేటర్లు వెంకటేశ్వర్లు, రవీందర్, సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, సీహెచ్‌ఓ రమేష్, టీపీఓ రాజేష్‌గౌడ్, డీఎఫ్‌ఓ శంకర్ లింగం, బయాలజిస్ట్ మాధవ రెడ్డి, ప్రతిమ ఆస్పత్రి డైరెక్టర్లు డా.అవినాష్ తిప్పని, డా.రాహుల్ నారాయణ్, క్లినికల్ అంకాలజిస్ట్ డా.సుచిత్ర తిప్పని, హెడ్ అండ్ నెక్ సర్జరీ అంకాలజిస్ట్ డా.అభినవ్ తదితరులు పాల్గొన్నారు.



మేయర్ సుధారాణికి బీపీ చెక్ చేస్తున్న కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, చిత్రంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, తదితరులు

సైబర్ నేరాలపై జాగ్రత్త



కాశిబుగ్గ: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మచ్చా శివకుమార్ సూచించారు. 21వ డివిజన్ తిలక్‌రోడ్డులో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత మద్యం, గంజాయి మత్తుకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని అన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజీలు, లింక్‌లకు స్పందించవద్దని చెప్పారు. ఆపద సమయంలో 100 నంబర్‌కు డయల్ చేయాలని కోరారు.

ఎన్‌సీసీ కేడెట్‌కు అభినందన



కేయూ క్యాంపస్: జాతీయ క్యాంపునకు ఎంపికైన ఎన్‌సీసీ కేడెట్, కాకతీయ యూనివర్సిటీలోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్న సాయిచంద్‌ను పలువురు అభినందించారు. ఈనెల 26నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ బెంగుళూరులో జరగనున్న జాతీయస్థాయి క్యాంపునకు 20మంది ఎన్‌సీసీ కేడెట్లు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రమణ వివరించారు. ఈమేరకు సాయిచంద్‌కు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, మెకానికల్ విభాగం అధిపతి సీహెచ్.రాధిక, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

హన్మకొండ అర్బన్: నాలుగేళ్లుగా జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.1600 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి, హనుమకొండ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డీఓ వెంకటేష్‌కు పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నాలుగేళ్లుగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు విడుదల కాకపోవడంతో అనేకమంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నప్పటికీ సమస్యపై స్పందించకపోవడం శోచనీయమని వాపోయారు.



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

30న ధర్నాను జయప్రదం చేయండి




వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 30 నిర్వహించనున్న ఇందిరాపార్కు వద్ద జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) న్యూ డెమోక్రసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక రైతు ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తూ.. స్వదేశీ, జాతీయత, దేశభక్తి పేరుతో ప్రభుత్వ సంస్థల ఆస్తులు, సహజ వనరులను బడా కార్పొరేట్ సంస్థలకు అమ్మకానికి పెట్టిందని విమర్శించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, న్యూ డెమోక్రసీ నాయకుడు రాచర్ల బాలరాజు, నాయకులు ఇనుముల కృష్ణ, ఎండీ.అక్బర్, రాజేందర్, హరిబాబు, భాషపాక అశోక్, రంజిత్, రాజేందర్, రాజేష్ పాల్గొన్నారు.

'మర్కజీ' విద్యార్థుల హెరిటేజ్ వాక్

విద్యారణ్యపురి: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ వల్స పైడి ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్ యువ టూరిజం క్లబ్ విద్యార్థులు వేయి స్తంభాల దేవాలయంలో గురువారం హెరిటేజ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా టూరిజం అధికారి శివాజీ, మర్కజీ పాఠశాల హెచ్‌ఎం రామారావు మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యాటకం, శాంతి అనే అంశంపై వేడుకలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రపంచ పర్యాటకాన్ని ప్రపంచ శాంతి కోసం వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి



ధర్నాలో మాట్లాడుతున్న మేకల రవి

వరంగల్: పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని, లేకుంటే ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి హెచ్చరించారు. పార్టీ వరంగల్ మండల సమితి ఆధ్వర్యంలో పోచమ్మ సెంటర్‌లో మండల కార్యదర్శి బుస్సా రవీందర్ అధ్యక్షతన గురువారం జరిగిన నిరసన కార్యక్రమంలో రవి మాట్లాడారు. ఉల్లిగడ్డల ధరలు పెంచి పేదలపై ప్రభుత్వాలు భారం వేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె బాషుమియా, నాయకులు గుండె బద్రి, గన్నారపు రమేష్, ఎండీ.కాసిం, జన్ను రవి, పరికరాల రమేష్, అంజద్, దస్రూ, అశోక్, స్వప్న, మనోహర్, సుధీర్, సుప్రియ, లక్ష్మి, వసంత, భార్గవి పాల్గొన్నారు.

బ్యాంకు కరస్పాండెంట్లు నిబంధనలు పాటించాలి

హన్మకొండ అర్బన్ : బ్యాంకింగ్ కరస్పాండెంట్లు ప్రభుత్వ నిబంధలు తప్పక పాటించాలని, ఖాతాదారుల వద్ద కమీషన్లు చేయకూడదని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతీ ఖాతాదారుడికి రూపే కార్డు, బీమా పథకాలు అందజేయాలన్నారు. 2023–2024 సంవత్సరానికిగాను 120 శాతం లక్ష్యాన్ని సాధించినందుకు బ్యాంకర్లను అభినందించారు. గత సంవత్సరంలో ప్రాధాన్యత రంగాలకు బ్యాంకుల ద్వారా రూ.5,333 కోట్లు రుణ మంజూరీ జరగగా, ఇందులో పంటలకు రూ.2,066 కోట్లు రుణాలు ఉన్నట్లు వివరించారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన అగ్రి ఇన్‌ఫ్రా, పీఎంఎఫ్‌ఎంఈ వంటి పథకాలకు ప్రాచుర్యం కల్పించి రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను కోరారు. 2024 –2025 సంవత్సరానికి ప్రాధాన్యత రంగాలకు జిల్లాలో రూ.6,998 కోట్ల లక్ష్యంగా నిర్ణయించారని, బ్యాంకర్లు త్వరగా రుణాలు మంజూరు చేసి జిల్లా ప్రగతికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, ఆర్‌బీఐ మేనేజర్ పల్లవి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, వివిధ బ్యాంకుల అధికారులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

వృద్ధాశ్రమాల్లో వయోవృద్ధుల దినోత్సవం



పండ్లు పంచుతున్న సీనియర్ అసిస్టెంట్ అరుణాదేవి

వరంగల్: జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆనంద ఆశ్రయ ఓల్డ్ ఏజ్ హోం, ఎలగందుల అమృత స్మారక ఓల్డ్ ఏజ్ హోం, లావణ్య ఓల్డ్ ఏజ్ హోంలలోని వృద్ధులను కలిసి వారి బాగోగులు, ఆశ్రమంలో సౌకర్యాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో వరంగల్ సీడీపీఓ విద్య, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు అరుణాదేవి, హేమలత, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ అనిరుద్ యాదవ్, జిల్లా సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు మల్లారెడ్డి, రాజేంద్రప్రసాద్, ఓల్డ్ ఏజ్ హోంల నిర్వాహకులు పాల్గొన్నారు.

మొలకెత్తిన గింజలతోనే ఆరోగ్యం



గర్భిణికి పోషకాలు అందజేస్తున్న సూపర్‌వైజర్



బొమ్మల ద్వారా అవగాహన కల్పిస్తున్న టీచర్

ఖిలా వరంగల్: మొలకెత్తిన గింజలు, చిరుధాన్యాలు, ఆకుకూరలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ ఉర్సు సెక్టార్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి సూచించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం ఎక్కువ తీసుకోవాలని తెలిపారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా వరంగల్ 42వ డివిజన్ ఆదర్శకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించాలన్నారు. రెండేళ్ల వరకు తల్లిపాలు కొనసాగించాలని చెప్పారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది అనిత, జ్యోతిరాణి, వినీత, నజీమా, యశోద, ఏఎన్ఎం శారద, ఆశ వర్కర్లు యమున, మమత, స్వరూప, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రీన్ డే

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం బుచ్చయ్యపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్రీన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అంగన్‌వాడీ టీచర్ రాధిక మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని పోషణ అభియాన్, పోషణ పక్వాడ్‌లో భాగంగా పచ్చదనంపై బొమ్మల ద్వారా పిల్లలకు అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో పిల్లలు, వారి తల్లిదండ్రులు, బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

సద్దులు, దసరాకు ఏర్పాట్లు చేయండి

ఖిలా వరంగల్: రంగలీల మైదానంలో సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, నగర మేయర్ గుండు సుధారాణికి వేర్వేరుగా గురువారం వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండ వెంకన్న, ఉపాధ్యక్షుడు గోనె, రాంప్రసాద్, వంగరి కోటేశ్వర్, నాగపూరి రంజిత్, వెలిదే శివమూర్తి, సందీప్, వెంకటేశ్వర్లు, అఖిల్, సంజీవ్, మహేష్, శ్రీను, నాగరాజు, విజయ్, కృష్ణం రాజు, రాజశేఖర్, రంజిత్, వంశీ, నాగరాజు, కష్ణమూర్తి, రవీందర్, బాలస్వామి, జయమహేష్ పాల్గొన్నారు.



మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

సంక్షిప్తంగా

నేడు ఐటీఐలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

వరంగల్: నైపుణ్యం, అర్హత కలిగిన సెమీస్కిల్డ్ కార్మికులకు విదేశీ కంపెనీల్లో ప్లేస్‌మెంట్ కల్పించేందుకు వరంగల్ ములుగురోడ్డు సమీపంలోని ఐటీఐ కాంప్లెక్స్‌లో ఉన్న ఆర్‌డీడీ కార్యాలయ హాల్‌లో శుక్రవారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు వరంగల్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ ఉమారాణి, వరంగల్ ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 99854 83931, 79959 57779, 78935 66493లలో సంప్రదించాలన్నారు.

నేడు జాబ్‌మేళా

హన్మకొండ అర్బన్ : జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు నగరంలోని ములుగు రోడ్డులోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నేడు (శుక్రవారం) జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ కంపెనీలో హైదరాబాద్, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో పనిచేసేందుకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 78933 94393 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

విద్యారణ్యపురి: పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత అని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి అన్నారు. ఈమేరకు హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్, కాకతీయ యూనివర్సిటీలో గురువారం పలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ మనుగడకు చెట్లే ఆధారమని వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు అనంత్, రమేష్, నర్సయ్య, లక్ష్మయ్య, ఎండీ.అలీ, సత్యనారాయణ, యోగా సభ్యులు శ్రీనివాస్, కిరణ్, వాకర్స్ సభ్యులు చమన్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు రేషన్ డీలర్ల సన్మానం

హన్మకొండ అర్బన్: హనుమకొండ తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శ్రీపాల్‌రెడ్డిని హనుమకొండ మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మొక్క అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల రమేష్‌బాబు, కృష్ణవేణి గౌరీశంకర్, ఉపాధ్యక్షులు రమేష్, మహేందర్, సరళ, స్వరూప, రహీముద్దీన్ ఖాన్, చంద్రశేఖర్, శ్రీశైలం, కోశాధికారి సమ్మయ్య, కార్యదర్శులు రామకృష్ణ, రజిత, ప్రేమలత పాల్గొన్నారు.

వ్యర్థ జలాలను అడ్డుకోవడంపై నిరసన



కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలో సైడ్ డ్రెయినేజీలతో పాటు ఎఫ్‌సీఐ మీదుగా వ్యర్థ జలాలను పోకుండా అడ్డుకోవడంపై కాలనీవాసులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. ఎకరం భూమిలో వ్యర్థ జలాలు నిల్వ ఉండటంతో తాగునీటి వనరులు కలుషితం కావడంతో పాటు దోమల ఉత్పత్తి విపరీతంగా పెరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకపోవడంతో విష జ్వరాల బారిన పడుతున్నామని వాపోయారు. కార్యక్రమంలో ఎండీ.నజీర్, ఎస్‌హెచ్ కరీం, సీహెచ్.కవిత, రాణి, సునీత, నిర్మల, నళిని పాల్గొన్నారు.

లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటు చేయాలి

హన్మకొండ అర్బన్: నగరంలోని ఫారెస్ట్ ఆఫీస్ నుంచి నక్కలగుట్ట మధ్యలోని ప్రధాన రహదారిపై ఏదైనా ప్రధాన కూడలిలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటు చేయాలని తెలంగాణ పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చందా మల్లయ్య, పోపా అధ్యక్షుడు ప్రొఫెసర్ రామస్వామి, జనరల్ సెక్రటరీ పరికిపండ్ల వేణు కోరారు. ఈమేరకు హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని గురువారం వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు.

దోమల నివారణకు చర్యలు

ఖిలా వరంగల్: దోమల నివారణకు వరంగల్ 40వ డివిజన్ ఉర్సు కరీమాబాద్‌లో బల్దియా అధికారుల ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఈమేరకు మురుగునీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేసే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. బీడీ కార్మికుల దవాఖాన డాక్టర్ సురేష్‌కుమార్ కలిసి కార్పొరేటర్ మరుపల్లి రవి మురుగునీటిలో ఆయిల్ బాల్స్ వేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కుసుమ కుమారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లింగాల కుమారస్వామి, శివకుమార్, నర్సయ్య, వనం కుమార్, బానోతు వెంకన్న, శ్రీనివాస్, కుమారస్వామి, రాము, దాసి రవి, ప్రశాంత్, రంజిత్, మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

కడిపికొండలో వైద్య శిబిరం

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో రాంపేట పీహెచ్‌సీ సబ్‌సెంటర్ కడిపికొండ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ వైద్య పరీక్షలు చేసి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యురాలు జ్యోత్స్న, సీహెచ్‌ఓ ప్రేమలత, సూపర్‌వైజర్ వల్లభ్, ఏఎన్‌ఎంలు రాధ, కోమల, ఆశ వర్కర్లు శ్రీవాణి, రమ, సునీత పాల్గొన్నారు.

దాడి కేసులో 8 మందిపై కేసు

ఖిలా వరంగల్: కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేసిన కేసులో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ ఫోర్ట్ ఏకశిలనగర్‌కు చెందిన బొడ్డు ప్రవీణ్ వాహన డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పాత కక్షలతో బొడ్డు ప్రవీణ్‌పై బొడ్డు శ్రీకాంత్, రేసుబాబు, రేసు రాజమ్మ, బొడ్డు మేఘన, ధర్మసాగర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్, రాము, యాదమ్మ తోపాటు ఇతరులు కలిసి కర్రలు, రాడ్లతో దాడి చేశారు. బాధితుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ శాంతినగర్‌లో కోడెం హరిప్రసాద్ పెయింట్ షాపులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేశారు. ఈమేరకు రూ.30,360 నగదు, 6 స్మార్ట్ ఫోన్లు, 4బైకులు, ప్లే కార్డులను స్వాధీనం చేసుకుని ఆరుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ వివరించారు.